సాక్షి
అనకాపల్లి
మంగళవారం : 23 : జనవరి : 2024



స్పందనకు 213 అర్జీలు

కలెక్టరేట్ స్పందనకు 213 అర్జీలు వచ్చాయి. విచారణ చేసి స్పష్టంగా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. 10లో



పురస్కార గ్రహీతలకు అభినందన

విశాఖ: ఎన్ఎస్ఎస్ అధికారి, వలంటీర్లకు రాష్ట్ర స్థాయి పురస్కారాలు లభించాయి. వీసీ ప్రసాదరెడ్డి వారిని అభినందించారు.



యోగా యూనిట్ ప్రారంభం

విశాఖ: ఆంధ్రా మెడికల్ కాలేజీ ఫిజియోథెరపీ విభాగం ఆధ్వర్యంలో యోగా యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు.



నక్కపల్లి:శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



అనకాపల్లి: పట్టణంలో నిర్వహించిన శోభాయాత్ర



అనకాపల్లి: శ్రీరామచంద్రమూర్తి ప్రతిమతో యాత్రలో పాల్గొన్న భక్తులు



చీడికాడ: దిబ్బపాలెం రామాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు



బుచ్చెయ్యపేట: కొండపాలెంలో ఇంటిపై శ్రీరాముని జెండాను పట్టుకున్న వానరం

జగదానందకారకునికి జేజేలు

అనకాపల్లి: అయోధ్య రామమందిరంలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం జిల్లా అంతటా రామనామం మార్మోగింది. వేకువజాము నుంచే పల్లెలు, పట్టణాల్లోని రామమందిరాల నుంచి జగదానందకారకునికి జేజేలు వినిపించాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు. ఈ వేడుకల్లో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పాల్గొన్నారు. పలుచోట్ల శోభాయాత్రలు నిర్వహించారు. జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు పెద్ద ఎత్తున ర్యాలీల్లో పాల్గొన్నారు. అనకాపల్లి పట్టణంలోని గాంధీనగరం, వేల్పులవీధి, మళ్లవీధి, గవరపాలెం పెదరామస్వామి, చినరామస్వామి, కోట్నివీధి, నూకాంబిక ఆలయం వద్ద, నెయ్యిలవీధి, మెయిన్‌రోడ్డు, నాగవంశంవీధి, లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, రామాలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. ఆయా రామమందిరాల్లో శ్రీరామస్తోత్రం, భజనలు, మహిళల కోలాటాలు ఆకట్టుకున్నాయి. స్థానిక శారదానది ఆంజనేయస్వామి ఆలయం నుంచి సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయం వరకు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర జరిగింది. ఈ యాత్రతో ప్రధాన రహదారి అంతా రామమయంగా మారింది. సీతా సమేత రామలక్ష్మణ, ఆంజనేయస్వామి వేషధారణతో పాటు నిలువెత్తు శ్రీరామచంద్రమూర్తి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ముస్లిం గ్రామంలో..

నక్కపల్లి: మండలంలోని పెదబోదిగల్లం గ్రామంలో మత సామరస్యం మరోసారి పరిఢవిల్లింది. ప్రతి ఏటా ఈ గ్రామంలో శ్రీరామనవమి వేడుకలను ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా సోమవారం ముస్లింలు గ్రామంలో ఉన్న రామాలయంలో ఉదయాన్నే ప్రత్యేక పూజలు నిర్వహించారు. జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేశారు.

న్యూస్‌రీల్

నేడు 'ఆసరా' సొమ్ము జమ

- జిల్లాలో 3,63,479 మందికి రూ.273.56 కోట్ల లబ్ధి

తుమ్మపాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం నిధులను మంగళవారం వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండలో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారు. 2019 ఎన్నికల నాటికి డ్వాక్రా మహిళలకు బ్యాంకుల్లో ఉన్న రుణ బాకీని తీరుస్తామని ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం ఇప్పటికి మూడు విడతలుగా నగదును చెల్లించింది. మిగిలిన మొత్తాన్ని జమ చేస్తూ ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా ఉత్సవాలను నిర్వహించనుంది. జిల్లాలోని 34,944 డ్వాక్రా గ్రూపుల్లోని 3,63,479 మందికి రూ.273.56 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

న్యాయ సహాయకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

చోడవరం రూరల్: జిల్లాలోని పలు కోర్టుల పరిధిలో ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం అందించాలన్న ఆసక్తి గల ఔత్సాహికుల నుంచి పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సత్తి అరుణశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా జడ్జి ఆలపాటి గిరిధర్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో 25 నుంచి 50 మంది వరకు న్యాయ సహాయకులను నియమిస్తామన్నారు. వీరికి శిక్షణ ఇస్తామని, ఏడాది పాటు సేవలందించాల్సి ఉంటుందన్నారు. ఎటువంటి పారితోషికం చెల్లించబోమన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా చోడవరం న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. కనీసం పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన వారు దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, విద్యార్హతల జెరాక్సు ప్రతులు, పాస్‌పోర్టు సైజు, స్టాంప్ సైజు ఫొటోను జతపరచాలని తెలిపారు. వివిధ సేవా సంస్థల్లో పనిచేస్తున్న వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందన్నారు.

రెవెన్యూ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి

తుమ్మపాల: జిల్లా రెవెన్యూ అసోసియేషన్ రూపొందించిన 2024 డైరీని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సోమవారం ఆవిష్కరించారు. సోమవారం తన చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, డీఆర్వో బి.దయానిధిలతో కలిసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకులు, ఎస్‌డీసీ కె.రమామణి, తహసీల్దార్లు ఎం.వి.రత్నం, కె.తిరుమలబాబు, కలెక్టరేట్ సెక్షన్ సూపరింటెండెంట్లు శ్రీనివాసరావు, నరసింహమూర్తి, చంద్రశేఖర్, డీటీలు మురళి, మూర్తి పాల్గొన్నారు.

జిల్లాలో ఓటర్లు 12,73,591



- పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం
- 6,20,048 మంది పురుషులు
- 6,53,505 మంది స్త్రీలు
- పెరిగిన ఓటర్లు 15,884 మంది
- తుది జాబితా విడుదల



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో మొత్తం 12 లక్షల 73 వేల 591 మంది ఓటర్లు ఉన్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన జిల్లా ఓటర్ల తుది జాబితాను ప్రకటించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జిల్లాలో గతేడాది అక్టోబర్ 27వ తేదీన రూపొందించిన ముసాయిదా జాబితా ప్రకారం.. మొత్తం ఓటర్లు 12 లక్షల 57 వేల 707 మంది కాగా, 6 లక్షల 13 వేల 144 మంది పురుషులు, 6 లక్షల 44 వేల 516 మంది స్త్రీలు, 47 మంది థర్డ్ జెండర్ ఉన్నారన్నారు. తాజాగా ప్రకటించిన జాబితా ప్రకారం 6 లక్షల 20 వేల 48 మంది పురుషులు, 6 లక్షల 53 వేల 505 మంది స్త్రీలు, 38 మంది థర్డ్ జెండర్ ఉన్నారన్నారు. మొత్తం 6,904 మంది పురుషులు, 8,989 మంది స్త్రీలు పెరగగా, థర్డ్ జెండర్లో 9 మంది తగ్గారని, మొత్తంగా 15,884 మంది ఓటర్లు పెరిగినట్లు తెలిపారు. గత మూడు నెలల నుంచి మార్పులు చేర్పులలో అన్ని విషయాలు పరిగణనలోనికి తీసుకుని క్షుణ్ణంగా తనిఖీ చేసి వాస్తవాలు ఆధారంగా తుది జాబితా తయారు చేశామన్నారు. వివిధ పార్టీల ప్రతినిధులు తెలియజేసిన సందేహాలను నివృత్తి చేశామన్నారు. ఓటర్ల జాబితాలో ఇంకా మార్పులు చేర్పులు చేసుకోవచ్చన్నారు. ఏకమొత్తంగా మార్పులకు గాని, చేర్పులకు గాని వీలు లేదని ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా ఫారం – 6, 7లను సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత నామినేషన్ వేయడానికి ఆఖరు తేదీకి పది రోజుల ముందు వరకు మార్పులు చేర్పులు తొలగింపులు చేయవచ్చని వివరించారు. ఎటువంటి సందేహాలు అనుమానాలు ఉన్నా నేరుగా కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని, ఈఆర్వో, ఏఈఆర్వోలను సంప్రదించవచ్చని సూచించారు. డీఆర్వో బి.దయానిధి, ఈఆర్వోలు అనకాపల్లి నర్సీపట్నం ఆర్డీవోలు చిన్నికృష్ణ, హెచ్‌వీ జయరాం, ఎస్‌డీసీలు ప్రమీల గాంధీ, రామలక్ష్మి, మనోరమ, పీఈఎం రాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బి.నాగజగదీశ్వరరావు, గొర్లి సూరిబాబు, నాగేశ్వరరావు, కె.హరినాథబాబు, సంతోష్, ఆర్ శంకర్, జీ చిన్నారావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జిల్లాలో ఈ నెల 22 నాటికి ఓటర్ల జాబితా వివరాలు...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జెండర్	మొత్తం
చోడవరం	243	1,04450	1,10561	06	2,15,017
మాడుగుల	235	91,291	95,921	11	1,87,223
అనకాపల్లి	251	1,01,744	1,09,148	05	2,10,897
యలమంచిలి	246	99,340	1,04,724	09	2,04,073
పాయకరావుపేట	292	1,21,911	1,25,595	02	2,47,508
నర్సీపట్నం	262	1,01,312	1,07,556	05	2,08,873
మొత్తం	1,529	6,20,048	6,53,505	38	1,27,3591

ఆన్‌లైన్లో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ సేవలు

- వాల్‌పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



ఆన్‌లైన్ సేవలపై పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్, రెన్యువల్, అదనపు అర్హతల నమోదు వంటి అన్ని సేవలు ఇక నుంచి ఆన్‌లైన్లో లభిస్తాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలిసి ఆయన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయానికి వెళ్లే అవసరం లేకుండా employment.ap.gov.in ద్వారా సులభతరీతిన అన్ని సేవలు లభిస్తాయన్నారు. సేవలను అన్ని జిల్లాల ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలు, మోడల్ కెరీర్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మొబైల్ ద్వారా పొందవచ్చన్నారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసినట్లయితే వెంటనే వివరాలు తాత్కాలిక రిజిస్ట్రేషన్ నంబర్ ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తారన్నారు. సంబంధిత జిల్లా అధికారి అభ్యర్థనను ఆమోదించిన పిదప వారికి ఎస్ఎంఎస్ ద్వారా ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ నంబరు తెలియజేస్తారన్నారు. అభ్యర్థి తన ఎంప్లాయిమెంట్ కార్డును లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, ఎంప్లాయిమెంట్ అధికారి కే.శాంతి పాల్గొన్నారు.

ఉత్సాహంగా పోలీస్ కమాండో పోటీలు



సీఆర్‌పీఎఫ్ కమాండోలతో అతిథుల గ్రూప్ ఫొటో

విశాఖ స్పోర్ట్స్: అఖిల భారత పోలీస్ కమాండో పోటీలు తొలిసారిగా ఆంధ్రప్రదేశ్ ఆతిథ్యమిస్తుండగా విశాఖలోని గ్రేహౌండ్ గ్రౌండ్స్ వేదికగా ప్రారంభమయ్యాయి. పదహారు రాష్ట్రాల పోలీస్ కమాండోలతో పాటు ఏడు కేంద్ర పోలీసు బలగాల జట్లు తొమ్మిది రోజుల పాటు ఐదు దశల్లో పోటీపడనున్నాయి. నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ పోటీలను ప్రారంభించారు. తొలుత ఆతిథ్య ఆంధ్రప్రదేశ్ కమాండో జట్టుతో పాటు బీహార్, గుజరాత్, హర్యానా, జమ్మూకాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరాఖండ్ కమాండో రాష్ట్ర జట్లు, కేంద్ర పోలీస్ బలగాల జట్టైన అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్, ఆర్పీఎఫ్, ఎస్ఎస్‌బీలతో పాటు డిఫెండింగ్ చాంప్ హోదాలో ఐటీబీపీ కమాండో జట్లు అతిథులకు గౌరవవందనాన్ని సమర్పించాయి. ఈ సందర్భంగా సీపీ రవిశంకర్ మాట్లాడుతూ గ్రేహౌండ్స్ విభాగంలోని అసాల్ట్ కమాండర్‌గానే 1997లో తన కెరీర్ ప్రారంభం కాగా నేడు అదే విభాగం ఆధ్వర్యంలో ఏఐపీసీసీ ప్రారంభ వేడుకకు హాజరుకావడం గర్వంగా ఉందన్నారు. తొలుత కార్యక్రమానికి అధ్యక్షత వహించి గ్రేహౌండ్స్ ఏడీజీ రాజీవ్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ పోటీలు నిర్వహించడం చక్కటి పరిణామమన్నారు. పోటీలకు సిద్ధమవుతున్న 23 జట్ల కమాండోలను అభినందించారు. నేవిగేషన్ దశతో పోటీలు ప్రారంభమై స్కిల్‌టెస్ట్, ప్లానింగ్ ఎగ్జిక్యూషన్, ఫిజికల్, ఫైరింగ్ రిఫ్లెక్లన్ కంబేట్ దశతో ముగియనున్నాయి. ఆయా జట్లు సాధించిన వ్యక్తిగత, జట్లు పాయింట్ల ఆధారంగా విజేతలకు 30వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమంలో ట్రోఫీలు అందజేయనున్నారు.

రంగురాళ్ల క్వారీల వద్ద గస్తీ ముమ్మరం

- తవ్వకాలకు యత్నించడంతో చర్యలు

గొలుగొండ: కరక రంగురాళ్ల క్వారీల వద్ద తవ్వకాలు జరగకుండా నిత్యం గస్తీ నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని నర్సీపట్నం సెక్షన్ అధికారి సత్యనారాయణ తెలిపారు. కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతాల్లో సంక్రాంతి పండగ సందర్భంగా తవ్వకాలు జరిపేందుకు తవ్వకందార్లు ప్రయత్నించారు. దీంతో గస్తీ ముమ్మరం చేశామన్నారు. కరక రంగురాళ్ల క్వారీ ప్రాంతాల్లో పనిచేసే బేస్ క్యాంప్ సిబ్బందితోపాటు కరక బీట్ పరిధిలో పనిచేసే సిబ్బంది రాత్రి, పగలు గస్తీ ఉంటారని, కరక కొండ చుట్టూ ఎవరూ సంచరించరాదని, అలా చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తవ్వకాలు జరిపేందుకు రెండు రోజుల క్రితం కొంతమంది సమావేశమైనట్టు తెలిసిందని, కరక కొండ చుట్టూ ఉన్న కరక, దోనిపాలెం, వడపర్తి, జమ్మవరం, కొత్త ఎల్లవరం, రాజుపేట, జిల్లెడిపూడి గ్రామాల్లో ప్రజలు కరక కొండ ప్రాంతం వైపు రాకూడదని ముందుగానే హెచ్చరికలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



రావికమతం: ముద్దుర్తిలో పాఠాలు బోధిస్తున్న కార్యకర్త



రోలుగుంట: అంగన్‌వాడీ నాలుగో కేంద్రంలో చిన్నారులకు భోజనం తినిపిస్తున్న దృశ్యం

- రావికమతం, రోలుగుంట మండలాల్లో యథావిధిగా సేవలు

రావికమతం/రోలుగుంట: ఇప్పటి వరకు సమ్మె చేపట్టిన పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రభుత్వ ఆదేశాలు, విజ్ఞప్తి మేరకు సోమవారం విధుల్లో చేరారు. కేంద్రాల్లోని పిల్లలకు యథావిధిగా పాఠాలు బోధించారు. భోజనం తినిపించి వారి ఆలనా పాలనా చూశారు. రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో నాలుగు మండలాల్లో 161మంది కార్యకర్తలు, 118 మంది ఆయాలు, ఆరుగురు మినీ కార్యకర్తలు విధులకు హాజరయ్యారని పీవో ఉషారాణి తెలిపారు. రోలుగుంట మండలంలో సోమవారం 57 మెయిన్ కేంద్రాలు, మూడు మినీ కేంద్రాలను తెరిచారు. మూడు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లకు నచ్చచెబుతున్న రోలుగుంట జెడ్పీటీసీ పోతల లక్ష్మీ రమణమ్మ ప్రయత్నం ఫలించింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో వారు పడ్డ కష్టాలను గుర్తు చేసి, జగనన్న ప్రభుత్వం తప్పకుండా వారి సమస్యలు తీరుస్తుందని ఆమె వారికి వివరించారు. రోలుగుంట, బుచ్చింపేట సెక్టార్ సూపర్‌వైజర్లు హేమ, రమ్య కూడా విధుల్లో చేరాలని కోరడంతో వారు యథావిధిగా కేంద్రాలకు హాజరయ్యారు.

గోశాల ప్రారంభం

చోడవరం: ప్రాచీన శైవ క్షేత్రాల్లో ఒకటైన చోడవరం శ్రీ స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన గోసంరక్షణ శాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ సోమవారం ప్రారంభించారు. దేవదాయశాఖ నిర్వహణలో ఉన్న ఈ ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో గో సంరక్షణశాలను నిర్మించారు. ఆలయంలో శ్రీకృష్ణుని రాతి విగ్రహం, అదే ప్రదేశంలో లింగాకారంలో ఉన్న మహాశివుని జ్ఞాన విగ్రహాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

ఆలయ ప్రధానార్చకుడు కొడమంచిలి చలపతిరావు ఆధ్వర్యంలో వేదపండితులు వేద మంత్రోచ్ఛారణల మధ్య గోశాలను ప్రారంభించారు. మొదటి రోజున ఐదు గోవులను దాతలు ఈ గోశాలకు అందించారు.

ప్రముఖ ప్రవచకుడు రామకృష్ణానందను మాజీ వీసీ ముర్రు ముత్యాలనాయుడు సత్కరించారు. ఆలయ ఈవో సత్యనారాయణమూర్తి, విరాళ దాతలు గొర్లె చెల్లంనాయుడు, గొర్లె ప్రసాద్ బాబు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ గూనూరు సత్తిబాబు పాల్గొన్నారు.



గోసంరక్షణ శాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



గోశాలలో ఆవును పూజిస్తున్న భక్తులు

దుబాయి వరల్డ్ కాన్ఫరెన్స్‌లో మేడికొండ ట్రైబల్ కాఫీ ప్రదర్శన

జి.మాడుగుల: మండలంలోని మేడికొండ ట్రైబల్ కాఫీకి అంతర్జాతీయంగా గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు రైతు సాధికార సంస్థ సీఈవో పరదాని గంగరాజు తెలిపారు. జి.మాడుగుల మండలం సింగర్బ పంచాయతీ ఎం.నిట్టాపుట్టుకు చెందిన గిరిజన రైతు సాధికార సంస్థ మేడికొండ ట్రైబల్ కాఫీ సబ్ కో, కృతి కాఫీ కంపెనీల ద్వారా దుబాయి వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్‌లో సోమవారం లాంచింగ్ చేసినట్టు ఆయన తెలిపారు. ఈ వరల్డ్ కాఫీ కాన్ఫరెన్స్ ఈ నెల 21నుంచి 23వరకు జరుగుతుందని ఆయన చెప్పారు. గత సంవత్సరం సెప్టెంబర్ నెలలో అరకు కాఫీని బెంగళూరులో సంస్థలకు పరిచయం చేసిన మాదిరిగానే తమ సంస్థ ద్వారా మేడికొండ ట్రైబల్ కాఫీనిదుబాయిలో కంపెనీలకు పరిచయం చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రకృతి సిద్ధంగా తయారైన ట్రైబల్ కాఫీకి మంచి స్పందన వస్తోందన్నారు.



దుబాయి కాన్ఫరెన్స్‌లో మేడికొండ ట్రైబల్ కాఫీ

క్లుప్తంగా

సెల్ టవర్‌లో మంటలు


సెల్‌టవర్ పై వ్యాపించిన మంటలు

పాయకరావుపేట : పట్టణంలోని పండరీపురంలో గల సెల టవర్ పై మంటలు వ్యాపించాయి. జియో, ఎయిర్‌టెల్ టవర్ పై కేబుల్ వైర్లు షార్కు సర్క్యూట్ అవడం కారణంగా మంటలు వ్యాపించినట్టు తుని అగ్నిమాపక అధికారి కె.రామునాయుడు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వెంటనే వెళ్లి మంటలను అదుపు చేశామని, ఏవిధమైన ప్రమాదం లేదని అన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు


రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులతో బద్రినాథ్

అనకాపల్లి : రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 19, 20, 21 తేదీల్లో తెనాలి జెఎంజె ఉమెన్స్ కళాశాల ఆవరణలో జరిగిన పోటీల్లో మూడు పతకాలను సాధించినట్టు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.బద్రినాథ్ అన్నారు. స్థానిక తమ కార్యాలయంలో సోమవారం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఆయన అభినందించారు. 83 కేజీల(జూనియర్) పురుషుల విభాగంలో ఆళ్ల సతీష్‌కు కాంస్యపతకం, 93 కేజీల (సీనియర్ విభాగంలో) కె.నరేంద్ర కాంస్య పతకం, బాలికల 76 కేజీల (సీనియర్ విభాగంలో) కె.ప్రవల్లిక రజత పతకం సాధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగుల శ్రీరామ్, గౌరవాధ్యక్షుడు కె.అప్పలనాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో స్పందనకు 213 అర్జీలు


స్పందన అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల : జగనన్నకు చెబుదాం-స్పందన అర్జీలు, ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ చేసి స్పష్టంగా సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయనతో పాటు జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారం దిశగా అన్ని శాఖల అధికారులు చొరవ చూపాలన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించి వారికి ఫలాలు అందించాలన్నారు. అధిక సంఖ్యలో ఇళ్ల స్థలాల అర్జీలు వస్తున్నాయని, వారి అర్హతలను పరిశీలించి అర్హులకు స్థలాలు మంజూరు చేయాలన్నారు. మొత్తం 213 అర్జీల నమోదు జరిగినట్టు జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి తెలిపారు.

పరిహారం భూములు రిజిస్ట్రేషన్ చేయాలి

ల్యాండ్ పూలింగ్ ద్వారా పేదలందరికీ ఇళ్లు పథకానికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారంగా ఇచ్చే భూములను హామీ ప్రకారం తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి ప్లాట్‌లను వుడా అభివృద్ధి చేయాలని కోరుతూ సబ్బవరం మండలం పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల రైతులు కలెక్టరేట్ వద్ద నిరసన చేసి కలెక్టర్‌కు వినతి అందించారు. మా గ్రామాల పరిధిలో ఒకే చోట ఎల్‌పీ నెం.56/2022 సుమారు 320 ఎకరాలు భూమి ఇచ్చామన్నారు. మాకు ఇచ్చిన రి-కానిస్ట్యూట్ ప్లాట్‌లకు బీటీ రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పించి వుడా లేఅవుట్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

బీమా సొమ్ము అందించాలని వినతి

మరణించిన తన భర్తకు రావాల్సిన వైఎస్సార్ బీమా సొమ్ము అందించాలని కోరుతూ నక్కపల్లి మండలం ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన చొప్పా నరసమ్మ స్పందనలో అర్జీ చేసుకుంది. 2020 ఏడాదిలో మరణించిన ఆమె భర్త చొప్పా బాబురావు వైఎస్సార్ బీమా ఉన్నప్పటికీ ఇప్పటికీ అందలేదని తెలిపింది. నాతో పాటు మా గ్రామంలో నలుగురు పేద కుటుంబాలకు కూడా బీమా రాలేదని తెలిపింది. తామంతా కలిసి స్పందనలో అర్జీ చేసుకుని కలెక్టర్ వద్ద మా బాధలు మొరపెట్టుకున్నామన్నారు. వారికి న్యాయం చేయాలని కోరారు.

గొల్లబంద చెరువును కాపాడండి...

అనకాపల్లి మండలం మాకవరం సర్వే నెం.177/10 మూడెకరాల చెరువు రికార్డులను ట్యాంపరింగ్ చేసి చెరువును అక్రమించాలని ప్రయత్నిస్తున్న మార్టూరు గ్రామానికి చెందిన పొల్నాటి అప్పారావుపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. మార్టూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు చెరువు ఆధారంగా సుమారు 50 ఎకారాలు ఆయా కట్టు కలిగి ఉన్నామని తెలిపారు. ఇటీవల సర్వే, మ్యూటేషన్ పూర్తి చేసేందుకు మండల అధికారులతో ప్రయత్నించిన విషయం తెలుసుకుని మండల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. చెరువు ఆక్రమణకు గురి కాకుండా రైతులకు న్యాయం చేయాలని వారు కోరారు.

ఎస్పీ కార్యాలయంలో స్పందనకు 26 అర్జీలు

అనకాపల్లి : ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందనకు 26 అర్జీలు వచ్చినట్టు ఎస్పీ కె.వి.మురళీకృష్ణ చెప్పారు. అర్జీదారుల నుంచి సమస్యలు తెలుసుకుంటూ దిగువ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి తగాదాలు, కుటుంబ సభ్యులు, చీటింగ్ వంటి సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. చట్టపరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్రైం ఎస్పీ పి.సత్యనారాయణరావు, ఎస్ఐ కె.సావిత్రి పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతో సాధ్యం


ఎం. కోటపాడులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు


వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం

మాడుగుల రూరల్ : సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో అన్ని సేవలు ప్రజలు ముంగిటకే అందుతున్నాయని, గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యం అయిందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఎం. కోటపాడులో నూతన ంగా రూ.43.60 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఆయన ప్రారంభించారు. రూ.20.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, రూ. 23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, నాడు నేడు తొలి దశలో రూ.18.27 లక్షలతో నిర్మించిన ఎంపీయూపీ పాఠశాల, రూ.11 లక్షలతో నిర్మించిన ఎం.కె. వల్లాపురం పాఠశాల భవనాలను ఆయన స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. సచివాలయం పరిధిలో గల ఎం. కోటపాడు, వల్లాపురం, గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు పెదబాబు, వైస్ ఎంపీపీ రాజారాం, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, సర్పంచ్‌లు శానాపతి శేషఫణి, లక్ష్మి, ఉప సర్పంచ్‌లు గంగాధర్, కరణం రాము, మాజీ సర్పంచ్ శ్రీరామూర్తి, పీహెచ్‌సీ వైద్యాధికారులు లీలాప్రసాద్, ప్రసాదు పాత్రుడు పాల్గొన్నారు.

మూడేళ్లయినా చర్యలు తీసుకోకపోతే ఎలా?

- టీడీపీ హయాంలో గుర్తించిన అక్రమాలపై ఉదాసీనత తగదు
- అధికారులపై ఎంపీపీ బోదెపు గోవింద్ అసంతృప్తి


ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి రూరల్: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చోటు చేసుకున్న అక్రమాలపై నేటికీ చర్యలు తీసుకోకపోవడంపై యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో యలమంచిలి మండలంలో జరిగిన పనులకు సంబంధించి ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక జరిగింది. దీనికి అధ్యక్షత వహించిన ఎంపీపీ డ్వామా అధికారుల తీరును ప్రశ్నించారు. మూడేళ్ల క్రితం జరిగిన ప్రజావేదికలో ఎమ్మెల్యే కన్నబాబు సమక్షంలో జంపపాలెం గ్రామానికి సంబంధించి గుర్తించిన అవకతవకల రికవరీ మూడేళ్లైనా ఎందుకు చేయలేదని ప్రజావేదికకు హాజరైన డ్వామా అధికారులను అడిగారు. దీనికి ప్రొసీజర్ పూర్తి కాలేదని అధికారులు చెప్పడంతో ఎంపీపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సార్పీ బండారు సూర్యనారాయణ మండలంలో ఈ నెల 2వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన సామాజిక తనిఖీ వివరాలను వెల్లడించారు. 2022-23 సంవత్సరంలో మండలంలో 583 పనులు జరగ్గా కూలీలకు వేతనాల కోసం రూ.5,25,50,747 చెల్లింపులు చేశారన్నారు. రూ.4,15,652 మెటీరియల్ నిమిత్తం ఖర్చు చేశారన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రామాల వారీగా సామాజిక తనిఖీల్లో గుర్తించిన అభ్యంతరాలను చదివి వినిపించారు. కృష్ణాపురంలో కూలీల మస్తర్లకు సంబంధించి అక్రమాలు చోటు చేసుకున్నట్టు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆరోపణలొచ్చాయి. దీనిపై అధికారులు రికవరీకి ఆదేశించారు. కూలీల మస్తర్లలో దిద్దుబాట్లు, కొలతల పుస్తకంలో లెక్కల్లో తప్పులకు సంబంధించి సిబ్బందిని హెచ్చరించిన అధికారులు వారికి రూ.14,500 జరిమానా చెల్లించాలని, సిమెంట్ బస్తాలను అడ్వాన్స్‌గా చూపిన పంచాయతీరాజ్ శాఖ అధికారులకు రూ.3,13,200 రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా అడిషనల్ పీడీ రోజారాణి, ఏపీడీ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారిణి నిర్మలాదేవి, క్లస్టర్ ఏపీడీ శ్రీనివాస్, ఎంపీడీవో అప్పలనాయుడు, ఏపీఓ ఎరకయ్య మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్య దొర, పంచాయతి రాజ్ డీఈఈ ముని శేఖర్, ఏఈ సోమశేఖర్ పాల్గొన్నారు.

యలమంచిలిలో దొంగల హల్‌చల్


చోరీ జరిగిన దుకాణ సముదాయం వద్ద విచారణ జరుపుతున్న పట్టణ ఎస్ఐ పాపినాయుడు


నగల దుకాణాల ఇనుప షట్టర్ విరగ్గొట్టిన దొంగలు

- మూడు నగల దుకాణాల్లో చోరీకి యత్నం
- గునపాలతో ఇనుప షట్టర్లు విరగ్గొట్టిన దొంగలు
- ద్విచక్రవాహనంతో ఉడాయింపు

యలమంచిలి రూరల్ : యలమంచిలి పట్టణంలో ఆదివారం రాత్రి ముగ్గురు వ్యక్తులు భవనం వీధిలో మూడు నగల దుకాణాల్లో భారీ చోరీకి యత్నించారు. గునపాం, ఇనుప రాడ్లతో ఎస్ కేపీటీ దుకాణ సముదాయంలో మూడు నగల దుకాణాల షట్టర్లను విరగ్గొట్టేందుకు యత్నించారు. శ్రీ జ్యోతిర్లింగ్ జ్యుయలర్స్ షట్టర్‌ను కొంతమేర తొలగించి దుకాణంలోకి చొరబడిన దొంగలు నగల దోపిడీకి యత్నించినా లాకర్ తెరుచుకోకపోవడంతో సాధ్యం కాలేదు. దుకాణంలో వస్తువులు చిందరవందర చేశారు. ఆధారాలు దొరక్కుండా సీసీ కెమేరా ఫుటేజీ నిక్షిప్తమైన డీవీఆర్‌ను ఎత్తుకుపోయారు. అంతకుముందు శ్రీసాయి కనక దుర్గ, శ్రీ దుర్గాభవానీ జ్యుయలర్స్ షట్టర్లను కూడా తొలగించడానికి యత్నించి విఫలమయ్యారు. భవనం వీధిలో 30 వరకు నగల దుకాణాలున్నాయి. ఈ ఘటనపై జ్యోతిర్లింగ్ జ్యుయలర్స్ యజమాని వికాస్ పైసల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు చెప్పారు. క్లూస్ టీం రంగంలోకి దిగి నిందితుల వేలి ముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. దుకాణ సముదాయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమేరాల ఫుటేజిలో ముగ్గురు వ్యక్తులు ముసుగులు, టోపీలు వేసుకుని ఇనుపరాడ్లు పట్టుకుని కలియతిరిగినట్టు గుర్తించారు. సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ పాపినాయుడు ఘటన జరిగిన నగల దుకాణాలను పరిశీలించారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

కాగా నగల దుకాణాల చోరీకి యత్నించిన దొంగలు పక్కవీధిలో నివాసముంటున్న ప్రైవేటు ఉద్యోగి గొలజాపు సూర్యారావుకు చెందిన ద్విచక్ర వాహనంతో ఉడాయించినట్టు బాధితుడు చెప్పాడు. అనకాపల్లిలో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్న సూర్యారావు ఆదివారం వ్యక్తిగత పనులపై శ్రీకాకుళం వెళ్లి తిరిగి రాత్రి యలమంచిలికి వచ్చారు. రాత్రి ఇంటి ముందు నిలిపి ఉంచిన తన ద్విచక్ర వాహనం ఉదయం నిద్రలేచి చూస్తే కనిపించలేదని తెలిపాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశానని సూర్యారావు తెలిపాడు.

గణతంత్ర, ఓటర్ల దినోత్సవాలకు ఏర్పాట్లు

తుమ్మపాల : ఈ నెల 25న జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవం, 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవం, విజయవంతం చేయాలని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న ఎన్టీఆర్ మైదానంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని ఎటువంటి లోటు లేకుండా విజయవంతం చేయాలన్నారు. వివిధ శాఖలకు అప్పగించిన పనిని పూర్తిచేయాలని, జిల్లా అధికారులంతా సమన్వయంతో కార్యక్రమాన్ని సజావుగా సాగేలా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అందరికి తెలిసేలా వివిధ శాఖల శకటాలను ప్రదర్శించాలన్నారు. 25న జరిగే ఓటర్ల దినోత్సవం నాడు ప్రభుత్వ కార్యాలయాల్లో ।ఓటరు ప్రతిజ్ఞ్ నిర్వహించాలన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కె.కోటపాడు : చౌడువాడ గ్రామానికి చెందిన కోమార నూకలక్ష్మి(32) పాముకాటుకు గురై ఆదివారం రాత్రి మృతి చెందింది. నూకలక్ష్మి ఆదివారం రాత్రి కల్లానికి నడుచుకొని వెళ్తుండగా ఎడమ కాలి బొటన వేలిపై పాముకాటు వేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు కె.కోటపాడు సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. దీంతో ఆమెను 108లో కేజీహెచ్‌కు తరలిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతురాలి భర్త అంజి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసును నమోదు చేశారు. సోమవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు.

36 కి.మీ స్ఫూర్తి పరుగు


జై శ్రీరామ్ అంటూ పరుగులు పెట్టిన చల్ల సుబ్రహ్మణ్య శర్మ

మహారాణిపేట: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట నేపథ్యంలో నగరానికి చెందిన 55 ఏళ్ల ప్రముఖ ఇంజినీర్ చల్లా సుబ్రహ్మణ్యశర్మ 36 కిలోమీటర్ల మేర జై శ్రీరామ్ అంటూ పరుగు తీశారు. ఎంవీపీ కాలనీలోని తన కన్సల్టెన్సీ కార్యాలయం వద్ద శర్మ పరుగు ప్రారంభించి బీచ్ రోడ్డు, కాళీమాత దేవాలయం, కోస్టల్ బ్యాటరీ, జగదాంబ, పోలీసు బ్యారెక్స్, అల్లిపురం, మెయిన్‌రోడ్డు, కాన్వెంట్ జంక్షన్, కంచరపాలెం ,104 ప్రాంతం మీదుగా సింహాచలం చేరుకున్నారు. మొత్తం 36 కిలో మీటర్ల దూరాన్ని 4.30 గంటల్లో చేరుకున్నారు. ఆయనతో పాటు మరో ఇద్దరు ఈ పరుగులో పాల్గొన్నారు. అలాగే మట్టిని కాపాడాలంటూ 2022 మార్చి 21 నుంచి పరుగు తీస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఎట్టకేలకు పాఠశాలలో నాడు నేడు పనులు


పాఠశాల భవనం పనులు ప్రారంభించిన వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు

సాక్షి ఎఫెక్ట్..


నాడు నేడు పనులను ఆటంకాలు కలిగించ రాదని చెబుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఎస్.రాయవరం : రేవుపోలవరం ఉన్నత పాఠశాల పనులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభమయ్యాయి. స్థల ఆక్రమణ సమస్యతో పదేపదే ఆటంకాలు కలగడంతో అయిదు నెలలుగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీనిపై ఇటీవల నాడు-నేడు పనులకు అడ్డంకులు..అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. సోమవారం నుంచి పనులు ప్రారంభించారు. వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పలరాజు కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. డీఎస్పీ శ్రీనివాసరావు సోమవారం వచ్చి పనులను పరిశీలించారు. దీనిపై పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చోడిపల్లి అప్పన్న సంతోషం వ్యక్తం చేశారు.

మాడుగుల ఎంపీపీ పదవికి రామధర్మజ రాజీనామా


జెడ్పీ సీఈవో పోలినాయుడుకు రాజీనామా లేఖను అందజేస్తున్న రామధర్మజ

మాడుగుల రూరల్ : మాడుగుల మండల పరిషత్ అధ్యక్ష పదవికి వేమవరపు రామధర్మజ (పెదబాబు) సోమవారం సాయంత్రం రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేస్తున్నట్టు ఆయన తన లేఖలో పేర్కొన్నారు. తన రాజీనామా లేఖను ఉమ్మడి జిల్లా పరిషత్ సీఈవో ఎం.పోలినాయుడుకు అందజేశారు. తాను ఎంపీటీసీగా కొనసాగుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ ఎంపీపీ రాజీనామా లేఖను కలెక్టర్ ఆమోదం కోసం పంపిస్తామన్నారు. పెదబాబు మాట్లాడుతూ తనకు రెండున్నర సంవత్సరాలు పాటు సహకరించిన ఎంపీటీసీ సభ్యులు, నాయకులకు, ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

62 మంది యువకుల రక్తదానం


తేగాడలో రక్తదాన శిబిరాన్ని సందర్శించిన వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

- సేవా కార్యక్రమాలతో మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు

కశింకోట: తేగాడలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో 62 మంది యువకులు రక్తదానం చేశారు. అమ్మ బ్లడ్ బ్యాంకు చైర్మన్ కిరణ్ సహకారంతో కార్యక్రమం జరిగింది. ఎంపీపీ కలగా లక్ష్మి, మాజీ ఎంపీపీ మలసాల ధనమ్మ, పార్టీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి పాల్గొన్నారు. కశింకోటలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. మలసాల భరత్‌కుమార్, సర్పంచ్ మంత్రి జయరజని పాల్గొన్నారు. బయ్యవరంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పేదలకు చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేల బావిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట : కశింకోట వద్ద నేల బావిలో పడి గుర్తు తెలియని 45 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్టు సీఐ ఎం. వినోద్‌బాబు సోమవారం రాత్రి తెలిపారు. స్థానిక ప్రైవేటు టౌన్‌షిప్‌లోని నేలబావిలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్టు వాచ్‌మెన్ సమాచారం అందించడంతో మృతదేహాన్ని వెలికి తీసి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. మృతుడు ఎర్రని షర్టు, నల్లటి డ్రాయిర్ ధరించి ఉన్నాడని, ఇతర వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేశామన్నారు.

అంతటా రామనామ స్మరణ



తాళ్లపాలెం రామాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

- అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా పులకించిన భక్తజనం
- పట్టణ నడిబొడ్డున నేత్రపర్వంగా శోభాయాత్ర
- ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు

అనకాపల్లి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా సోమవారం వాడవాడలా రామనామ స్మరణ మార్మోగింది. మండలంలోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగరం, వేల్పులవీధి, మళ్లవీధి, గవరపాలెం పెదరామస్వామి, చినరామస్వామి, కోట్నివీధి, నూకాంబిక ఆలయం, నెయ్యిల వీధి, మెయిన్‌రోడ్డు, నాగవంశంవీధి, లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, రామాలయాల్లో విశేష పూజలు, అర్చనలు జరిగాయి. బడి, గుడి, పలు గృహాలపై జై శ్రీరామ్ పతాకాలు రెపరెపలాడాయి.

- నాయకుళ్ల వీధిలో సీతా సమేత రామచంద్రమూర్తి, లక్ష్మణ, ఆంజనేయస్వామి పట్టాభిషేకం చిత్రపటానికి స్టీల్ కంపెనీ అధినేత శెట్టి శ్రీరాం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 1000 మందికి ప్రసాదం అందజేశారు.
- స్థానిక ఉడ్‌పేటలోని ఓ ప్లేస్కూల్‌లో చిన్నారులు సీతా సమేత శ్రీరామచంద్రమూర్తి పరివార వేషధారణలో ఆకట్టుకున్నారు.

నేత్రపర్వంగా శోభాయాత్ర...

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక శారదానది ఆంజనేయ స్వామి ఆలయం నుంచి సుంకరమెట్ట సత్యనారాయణస్వామి ఆలయం వరకు నేత్రపర్వంగా శోభాయాత్ర సాగింది. డీఎస్పీ వి.సుబ్బరాజు, జెడ్పీ ఎస్.వెంకటరమణలను పరిషత్ ప్రతినిధులు కోరిన అనుమతి మేరకు సీఐలు జి.శంకరరావు, శ్రీను ఆధ్వర్యంలో భారీ బందోబస్తు మధ్య యాత్ర ప్రశాంతంగా సాగింది. పరిషత్ సభ్యులు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవం

కోట్ని వీధి సీతారామ దేవస్థానంలో ఆలయ యూత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్‌చే అర్చకులు కల్యాణ వేడుకలు జరిపించారు. కొణతాల బాలసుబ్రహ్మణ్యం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీకన్యకాపరమేశ్వరి ప్రార్థనా సంఘం సభ్యుల శ్రీరామ సంకీర్తన భక్తులను ఆకట్టుకుంది. స్వామివారి రథయాత్రలో కోలాటం ఆకర్షణగా నిలిచింది. సాయంత్రం రాములోరి తీర్థం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 84వ వార్డు ఇన్‌ఛార్జి కోరుకొండ రాఘవ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



శ్రీరామచంద్రమూర్తి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఉడ్‌పేటలో సీతారాముల వేషధారణలో అలరిస్తున్న చిన్నారులు



కస్నూరుపాలెం రామాలయంలో భక్తుల సందడి



శోభాయాత్రలో ఆకట్టుకుంటున్న సీతా సమేత రామలక్ష్మణ, హనుమాన్ వేషధారులు



జెట్టపురెడ్డితుని రామాలయంలో భజనచెట్టుకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కశింకోట కస్బా వీధి రామాలయంలో నిర్వహిస్తున్న భజన కార్యక్రమం

ప్రత్యేక పూజలు, భజన

కశింకోట: మండల గ్రామాల్లోని రామాలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కశింకోట గవరపేటలోని శారదా గణపతి రామాలయంలో అర్చకుడు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పంపిణీ చేశారు. మహిళలు భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భీశెట్టి దుర్గా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.



కశింకోట గవరపేట రామాలయంలో సీతారాములకు పూజలు చేస్తున్న అర్చకుడు సుబ్రహ్మణ్యం



కోట్ని వీధిలో సీతారాముల కల్యాణ వేడుకల్లో పాల్గొన్న జానకీరామరాజు, రమేష్

- కస్బా వీధి రామాలయంలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమం, దీపార్చన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, విశ్వహిందూ పరిషత్ కశింకోట ప్రఖండ అధ్యక్షుడు శిష్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.
- కస్నూరుపాలెం, ఏఎస్ పేట, గొబ్బూరుపాలెం రామాలయాల్లో పూజలు, అన్నసమారాధన, భజన కార్యక్రమాలు నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా శ్రీరాముడి చిత్రపటాన్ని ఊరేగించారు. ఆలయాల వద్ద దీపాలంకరణ చేశారు. సమరసత సేవా సంఘం మండల కన్వీనర్ మందపల్లి శివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
- జెట్టపురెడ్డితుని రామాలయంలో మహిళలతో భజన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కోన నాగేశ్వరరావు, కె.వి.వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
- కొత్తపల్లి, గొబ్బూరు, తాళ్లపాలెం రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

క్లుప్తంగా

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



విద్యార్థినికి ట్యాబ్ అందజేస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి

అనకాపల్లి: విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ పాఠశాలలను దశల వారీగా కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నట్లు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి తెలిపారు. వేల్పుల వీధి జీవీఎంసీ హైస్కూల్‌లో సోమవారం 8వ తరగతి విద్యార్థినులకు బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదవడం వల్ల ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. ఉన్నత స్థాయిలో ఉన్న విద్యార్థులు పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్‌ఎం రుదిరా రాణి, విద్యా కమిటీ చైర్మన్ హరికృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పార్టీ నేత బొండా శంకరరావు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అనకాపల్లి: స్థానిక పెరుగుబజార్ జంక్షన్‌లోని రహదారి విస్తరణ పనుల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అనకాపల్లి డివిజన్ విద్యుత్ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డీ1 సెక్షన్ ఏఈ శ్రీనివాసరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెరుగుబజార్ నుంచి గాంధీబొమ్మ జంక్షన్ వరకూ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా విద్యుత్‌ను నిలిపి వేసి కొత్త స్తంభాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ మేరకు లక్ష్మీనారాయణనగర్, కొట్నివీధి, మళ్ల వీధి, గాంధీబొమ్మ జంక్షన్, చిన్నవీధి, పప్పులవీధి, భీమునిగుమ్మం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని వారు కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

అనకాపల్లి: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి నెహ్రూ చౌక్‌కు ప్రదర్శనగా చేరుకొని అక్కడ అంగన్‌వాడీలు మానవహారంగా ఏర్పడి నినదించారు. కార్యక్రమంలో నేతలు కె.లోకనాథం, గంటా శ్రీరాం, దాకారపు శ్రీనివాసరావు, బుడిగి నూక అప్పారావు, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు సోమవారం 6,203 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,510	4,460
మొదటి రకం	3,570	4,160
రెండో రకం	3,460	3,750
మూడోరకం	3,150	3,480

అనకాపల్లి సినిమాలు

గుంటూరు కారం : రాజా
గుంటూరు కారం : సత్యనారాయణ స్క్రీన్-1
హనుమాన్ : సత్యనారాయణ స్క్రీన్-2
నా సామిరంగ : షిర్డీసాయి
సైంధవ్ : పర్తిసాయి
గుంటూరు కారం(రెండు షోలు)
సలార్ (రెండు షోలు) : వెంకటేశ్వర
నా సామిరంగ : శ్రీసత్య
హనుమాన్ : రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 100 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8, బీ పాజిటివ్-21, ఓ పాజిటివ్-61, ఏబీ పాజిటివ్-7, ఓ నెగిటివ్-2, ఏబీ నెగిటివ్-1 యూనిట్ చొప్పున శుద్ధి చేసిన రక్తం అందుబాటులో ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబర్‌లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 446 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 394 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీని 08924223595 నంబర్‌లో సంప్రదించవచ్చు.

పేదలకు అన్ని వసతులతో టిడ్కో ఇళ్లు

అనకాపల్లి: అర్హులైన పేదలకు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో కూడిన టిడ్కో గృహాలను ఉచితంగా ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి అందజేస్తున్నట్లు 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. వార్డులోని సచివాలయం 14 పరిధిలో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన యాజమాని హక్కు పత్రం, ఆరోగ్యశ్రీ కార్డులను సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో మండలంలోని సత్యనారాయణపురంలో టిడ్కో గృహాలను పేదలకు అందజేయంలో పూర్తిగా విఫలమైందన్నారు. అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో మరోసారి ఆయనను సీఎంగా గెలుపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనరసింహరావు, పార్టీ నాయకులు గైపూర్ రాజు, దాడి భోగలింగేశ్వరరావు, కర్రి భాస్కరరావు, పి.కల్యాణ్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు టిడ్కో గృహ హక్కు పత్రాన్ని అందిస్తున్న కార్పొరేటర్ సునీత

మహిళా పక్షపాతి సీఎం జగన్



సమావేశంలో పాల్గొన్న పొదుపు సంఘాల సభ్యులు



మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

అనకాపల్లి: ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. స్థానిక నర్సింగరావుపేటలో పొదుపు సంఘాలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడతలో వార్డులోని 225 సంఘాలకు సుమారు రూ.85 కోట్లు సభ్యుల ఖాతాల్లో జమ కానుందని చెప్పారు. మహిళా పక్షపాతి ముఖ్యమంత్రి జగన్‌కు రానున్న ఎన్నికల్లో అందరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్‌లు ఎ.వి.రత్నకుమారి, మునూరు శ్రీను, పార్టీ నాయకులు పలకా సత్యనారాయణ, కూండ్రపు సత్తిబాబు, పలకా వాసు, కోన ఉమ పాల్గొన్నారు.

గుండాలమ్మా.. చల్లగ చూడమ్మా



గుండాలమ్మను దర్శించుకున్న భక్తులు



భక్తులకు అన్నప్రసాదం అందజేస్తున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ రెడ్డి వారి పేరంటాలు శ్రీ గుండాలమ్మ తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తప్పెటగుళ్లు, చిడతలు, కోయడ్యాన్సులు, నేల డ్యాన్సులు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. మధ్యాహ్నం పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు అమ్మవారి ప్రసాదం అందజేశారు. రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు కాసు అంజిరెడ్డి, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, గొర్లివానిపాలెం సర్పంచ్ గొర్లి గోపీ అమ్మలు, మాజీ ఆర్‌ఈసీఎస్ అధ్యక్షుడు చల్లా కనకారావు, నాయకులు బొద్దపు చిన్నారావు, పోతల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల దరఖాస్తులకు 30 వరకు గడువు

యలమంచిలి: మండలంలో న్యాయ సహాయకులుగా పనిచేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు ఎ.సాయికుమారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా జడ్జి ఉత్తర్వుల మేరకు యలమంచిలి మండల పరిధిలోని ప్రజలకు న్యాయ పరమైన సలహాలతో పాటు తగు న్యాయ సహాయం చేయాలనే ఆలోచనతో ఉన్న ఔత్సాహికుల నుంచి పారాలీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు) గా పనిచేయుటకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, అభ్యర్థులు ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులతో పాటు ఆధార్‌కార్డు, విద్యార్హత పత్రాలు, ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, ఇతర సంబంధిత పత్రాలు జతచేసి యలమంచిలి న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. దీనికి కనీస విద్యార్హత పదోతరగతి, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతమూ ఉండదని, ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ తరగతుల అనంతరం 25 నుంచి 50 మందిని పారాలీగల్ వలంటీర్లుగా ఒక ఏడాది కాలానికి నియమిస్తారని తెలిపారు. న్యాయ సేవల రోజులకు మాత్రమే గౌరవ వేతనం రూ.250 ఇవ్వబడుతుందని తెలిపారు.

ముగిసిన మండల స్థాయి క్రీడలు

యలమంచిలి : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమ ప్రతిభను నిరూపించుకోవడానికి ఒక మంచి అవకాశంగా నిలిచిందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆడుదాం ఆంధ్రా మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన జట్లకు సోమవారం యలమంచిలి మండల పరిషత్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేసి ఆట పరికరాలను అందజేశారు. 24న జరగనున్న నియోజకవర్గ స్థాయి క్రీడల్లో ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు.

ఘనంగా మంత్రి అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు

అనకాపల్లి: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదిన వేడుకలు సోమవారం పట్టణ, మండల ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులకు అందించారు. ముందుగా 400 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జానకీరామరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణాన్ని మంత్రి అమర్‌నాథ్ అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

- నూకాంబిక అమ్మవారి దేవాలయంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ హోమం, అభిషేకాలు నిర్వహించి, పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. తుమ్మపాలలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. ముందుగా మిందిలో గుడివాడ అమర్‌నాథ్‌ను గజమాలతో పార్టీ నాయకులు సత్కరించారు. కలగా లక్ష్మి, పార్టీ కశింకోట, అనకాపల్లి మండలాల అధ్యక్షులు మలసాల కిషోర్, పెదిశెట్టి గోవింద్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, ఎన్టీఆర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు జి.రామ్మూర్తి, ఏవీ, రత్నకుమారి, పార్టీ నాయకులు కోరుకొండ రాఘవ, ఉగ్గిన అప్పారావు, మద్దాల రమణబాబు, దేవాలయాల చైర్మన్లు పాల్గొన్నారు.



మిందిలోని స్వగృహంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

స్వచ్ఛందంగా రక్తదానం

మండలంలోని అక్కిరెడ్డిపాలెం పంచాయతీ ఎన్టీఆర్ కాలనీ ప్రభుత్వ హైస్కూల్ ఆవరణలో కేఎంసీ యువసేన ఆధ్వర్యంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ఎంపీపీ గొర్లి సూరిబాబు ప్రారంభించి మాట్లాడుతూ యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ముందుగా 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు అందజేశారు. శిబిరంలో 31 మంది నుంచి విశాఖ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు రక్తం సేకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు నారపిన్ని ప్రసాద్, పార్టీ శ్రేణులు ఎ.రాజశేఖర్, బొండా అప్పారావు, శ్రీహరిరాజు, నారపిన్ని సాయికుమార్, అక్కిరెడ్డి సత్తిబాబు, సాలాపు శ్రీను, తంగేటి ప్రకాష్ పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

ట్రాఫిక్ రూల్స్‌పై ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లి: ఆటో డ్రైవర్లందరూ యూనిఫాం ధరించాలని ట్రాఫిక్ సీఐ శ్రీను సూచించారు. రహదారి వారోత్సవాల్లో భాగంగా సోమవారం శారదా బ్రిడ్జి రహదారిలోని ఎస్‌బీఐ కార్నర్ వద్ద ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఫ్రంట్ సిట్టింగ్ లేకుండా చూసుకోవాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అధిక ప్రయాణికులతో వేగంగా ప్రయాణించరాదని సూచించారు. వెనుక సిట్టింగ్‌ను కూడా తగ్గించాలన్నారు. ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

17 మద్యం సీసాలతో ఇద్దరి అరెస్ట్

పరవాడ: మండలంలోని రెండు గ్రామాల్లో అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉన్న ఇద్దరిని సోమవారం పరవాడ పోలీసులు అరెస్ట్ చేశారు.

- కలపాక గ్రామానికి చెందిన బొండా గోవింద్ 8 మద్యం సీసాలు పట్టుకుని వెళుతుండగా పోలీసులు దాడి చేసి పట్టుకొని కేసు నమోదు చేశారు.
- తానాంకు చెందిన పైల అప్పారావు అక్రమ మద్యం కలిగి ఉన్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్‌ఐ జి.తేజేశ్వరరావు సిబ్బందితో దాడి చేసి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు సీఐ ఎస్.బాలసూర్యారావు చెప్పారు.

నోడల్ అధికారి సందర్శన



వాడ్రాపల్లిలో ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీపై ఆరా తీస్తున్న నోడల్ అధికారి డాక్టర్ దేవి

మునగపాక : మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆరోగ్యశ్రీ రాష్ట్ర నోడల్ అధికారిణి డాక్టర్ ఎల్.బి.ఎస్.దేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంతవరకు మండల వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ ఎంతవరకు వచ్చిందనే విషయాలపై అడిగి తెలుసుకున్నారు. జాతీయ కార్యక్రమాలు శతశాతం పూర్తి చేయాలని, పిల్లల్లో రక్తహీనత లోపం లేకుండా చూడాలని సూచనలు చేశారు. వాడ్రాపల్లిలో వలంటీర్లతో కలిసి ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ తీరును పరిశీలించారు.

మళ్లీ మళ్లీ ఇది రాని రోజు

కశింకోట: కశింకోటలోని డీపీఎన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1975-76 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. ఇందుకు దేవీపురం వేదికైంది. చాలా ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పాత మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. రోజంతా ఆనందంగా.. సందడిగా గడిపారు. ఆత్మీయ కలయికకు గుర్తుగా అంతా కలిసి ఫొటో దిగారు. పూర్వ విద్యార్థుల్లో 60 ఏళ్లు దాటిన పాలూరి కల్యాణి, భీశెట్టి భాస్కరరావు, అబ్దుల్ మన్ననలను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఆళ్ల ఓంరాం, గొన్నాబత్తుల కమలకుమార్, పాలూరి సాయి త్రినాథ్, తగరంపూడి గణపతి, రిటైర్డ్ ఏఈవో నంబా రమణ, కె.గోపాలరావు, వెలుగుల బాబూరావు తదితరులు పాల్గొన్నారు.



కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూల్ 1975-76 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సందడి

ప్రాథమిక హక్కులపై విద్యార్థులకు అవగాహన

సబ్బవరం: దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీకి చెందిన ప్రో బోనో క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం విశాఖ నగరంలోని డా గార్డెన్స్ జీవీఎంసీఉన్నత పాఠశాల విద్యార్థులకు న్యాయ శిక్షణ శిబిరం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న క్లబ్ చైర్ పర్సన్ సునీత మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక హక్కులను అర్థం చేసుకోడంతో పాటు కనీస న్యాయ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. వాటిపై అవగాహన కల్పించడానికి శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సోషల్ మీడియాలో జరుగుతున్న నేరాలు, గృహహింస, బాల్య వివాహాలు, లైంగిక దాడులు, వేధింపులు, పోక్సో చట్టం వంటి అనేక ముఖ్యమైన, కొన్ని సున్నితమైన అంశాలను వివరించారు. క్లబ్ సహాయక సభ్యులు భువనేశ్వరి, న్యాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన శిబిరంలో క్లబ్ చైర్ పర్సన్ సునీత

'జగనన్నకు చెబుదాం'కు ఐదు వినతులు

పెందుర్తి: జీవీఎంసీ జోన్-8 వేపగుంటలోని ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో పలు సమస్యలపై మొత్తం ఐదు వినతులు వచ్చాయి. అక్రమ నిర్మాణాలు, ఇతర సమస్యలపై జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడుకు ఫిర్యాదు చేశారు.